# లక్ష్యసిద్ధి

భారత బాలవీరుల గూర్చిన వచన నాటిక

రచయిత:

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

హాస్తినాపురం బయట బ్రహ్మాండమైన అస్త్రవిద్యాసందర్శనరంగం యేర్పాటయినది.

భీష్ముడీయేర్పాటు గత సంవత్సరమే చేయించాలని సంకల్పించుకున్నాడు ; కాని కృపాచార్యుడు కొంచెం నిరుత్సాహం కనపరిచాడు. 'కుమారులందరూ శ్రద్ధగానే వున్నారు. అయితే, తమలో తాము పోటీలు పెట్టుకోడమే గాని, పెద్దల కిలాంటి వుద్దేశం వున్నదని వారెరుగరు. ఎరిగి వుంటే వుండే శ్రద్ధ వేరు. అప్పుడు జరిగే పరిశ్రమ వేరు. కనక, యిప్పుడీ సంగతి వెల్లడిచేసి వూరుకుందాం. దీనివల్ల కుమారులలో ప్రచ్ఛన్నాలై వున్న శక్తులన్నీ ప్రబుద్ధాలవుతవి' అని అతను చాలా దూరం చెప్పగా 'బాగుం'దని భీష్ముడంగీకరించి అప్పటికి వూరుకున్నాడు.

ద్రోణుడున్నూ యిందుకంగీకరించాడు.

సంవత్సరమూ తిరిగింది. తన బోధనాచాతుర్యం యెప్పుడు వెల్లడి అవుతుందా అని ద్రోణుడు రోజూ రోజూ తొందరపడుతున్నాడు; కాని కృపాచార్యుడు, తనకి, ఆదృష్టే లేనట్టు ప్రవర్తించసాగాడు. అతనికిన్నీ వుత్సాహం లేకపోలేదు ; అయితే, దాన్ని అణుచుకునే శక్తి వున్న దతనికి మొత్తానికి- ద్రోణుడులా కాక అతను కొంచెం 'స్వయంపాకం' మనిషి.

ఏమయినా చివరికి తప్పింది కాదు.

ముహూర్తం యేర్పడినది. సకలసన్నాహాలున్నూ పూర్తి ఐనవి.

ప్రధానప్రేక్షాగారంలో దేవీశత పరివృతుడై ధృతరాష్ట్రుడు కూచునివున్నాడు. గాంధారి అతని పక్కనేవున్నది. కుంతి కొంచెం యెడంగావున్నది. ఆ మొత్తోటీ, ధృతరాష్ట్రుడితోటీ మాట్లాడ్డాని కనువుగా వుండేటట్టు, విదురుడు, ఆ యిద్దరికీ మధ్య కూచునివున్నాడు.

భీష్ముడూ, ద్రోణుడూ, కృపుడూ మొదలైన ప్రధానపురుషులు తమతమ ప్రేక్షాగారాల్లో వున్నారు. రాజబంధువులూ, పౌరప్రముఖులూ వితానంలో అర్హాసనాలలంకరించి వున్నారు.

వేలకొద్దీ పౌరులున్నూ ఉచితస్థలాలలో కూచుని వున్నారు.

ఈప్రదర్శనంలో పాల్గొనే కుమారులందరూ వొక్కచోటనే వుండినా, వారిలో, కౌరవులూ తదభిమానులూ వొక పక్కగానూ, పాండవులూ తదనుయాయులూ మరొక పక్కగానూ విడిపోయి కూచుని వున్నారు.

మొదట సామాన్యుల ప్రదర్శనం అయిపోయింది. తరవాత ధర్మనందనుడూ, దుశ్శాసనుడూ, నకులసహదేవులూ - యిలాంటివారు తమ తమ చాతుర్యాలు చూపించారు.

అవన్నీ చూసి ప్రేక్షకులు సంతోషించకపోలేదు ; కాని వారికి తృప్తి కాలేదు. భీష్ముని ప్రతాపమూ, ధృతరాష్ట్రుని వీర్యమూ, పాండురాజు శౌర్యసాహసాలూ యెరిగివున్నవారు 'వారి వంశంలో యిలాంటివారెందుకుపుట్టారబ్బా' అనుకునేటట్టుగా వున్నవి వారి శక్తిసామర్థ్యాలు.

భీష్ముడు కొంచెం నిర్వేదం కనపరిచాడు. విదురుడు, 'ఫలానావారు రంగానికి వచ్చా'రని మాత్రమే చక్రవర్తితో చెప్పి వూరుకోసాగాడు. కృపాచార్యుడున్నూ వుత్సాహం కనపరచలేకపోయాడు. ద్రోణుడు వెంటవెంటనే సెలవిచ్చేస్తూ వచ్చాడు.

మీాద వుండడం గుర్తించి, కర్ణుడున్నూ మాటిమాటికీ సుయోధనుణ్ణి విడిచి ద్రోణుణ్ణీ, ద్రోణుణ్ణి విడిచి సుయోధనుణ్ణీ చూస్తూ బుస్సలు కొడుతూ వుండడమూ గమనించి, స్వగతంగా నాలుక కరుచుకుని గప్చిప్గా వూరుకున్నాడు.

కృపాచార్యుడు అందరి యింగితమూ కనిపెడుతూనూ వున్నాడు. ద్రోణుడి అస్వాతంత్ర్యానికి మురిసిపోతూనూ వున్నాడు.

'ధనురాచార్యులవారు అర్జునుడికి వుజ్జీ యేర్పరచ రేమీా?' అని నిర్భయంగా గుసగుసలు రేగాయి. కర్ణు డొక్కడే అర్జును ణ్ణెదురుకో గలవా డనీ, కర్ణుడి ముందు అర్జును డెలాగా తీసికట్టయిపోతా డనీ, యిది తెలిసే ద్రోణు డిలా చేశా డనీ, కొందరు కొంచెం స్పష్టంగానే అనుకున్నారు.

ఈగుసగుసలవల్ల, అప్పటిదాకా నిస్తరంగసముద్రం లా వున్న ఆరంగస్థలం గాంభీర్యం భంగపడిపోయింది.

భీష్ముడు పూర్తిగా విసిగిపోయాడు. ధృతరాష్ట్రుడు ఇక కట్టిపెట్టగూడదా? అనేద్దా మనుకుంటున్నాడు. కర్ణుడు 'ఇక ఆగలేను. వెళ్ళి వురుకుతా' అన్నట్టు సుయోధనుడి కేసి ఆకొన్న సింహప్పిల్లలా చూశాడు. సుయోధనుడున్నూ అంతకంటెనూ తొందరపడుతూనే —మొదట కొంచెం తటపటాయించి చివరికి 'యేమయినా కానీ' అని సాహసించి, గభీ మని కర్ణుణ్ణి రెక్కపట్టుకు లేవతీసి 'ఇక మాట తక్క' దన్నట్టు ద్రోణుడి కేసి వులుకూ పులుకూ చూశాడు.

ఇదంతా చూసి, ద్రోణుడున్ను, తన నిండుహృదయం ప్రేరేపించగా, వొక్కమాటు భీష్ముడి కేసి తీవ్రంగా చూసేసి కళ్ళతో కర్ణుడికి ఆజ్ఞ యిచ్చాడు.

ద్రోణుడు చూపు లందాయి. అంతే. కర్ణుడు, వొక్కదూకున





"ఆంధ్రభూమి" అన్నిపరిశ్రమలకు ఆలయం కావాలి !!!......

మీరు మీాస్వశక్తిని గుర్తింపకున్నారు !!...

మీా అఖండఖ్యాతి అడుగంటలేదు సుమండీ !!

• ఆధారంలేని ఆలాపాలకు ఎంతమాత్రం లొంగిపోవద్దు !.................

ఇదిగో! —మీరు గర్వించవలసిన...

ప్రథమ ఆంధ్రకుష్ఠు చికిత్సాలయం

25 సంవత్సరముల అనుభవంతో తయారుచేయుచున్న "లెప్పర్ క్యూర్" ఔషధం!!

కుష్ఠు, మేహ, బొల్లి, సుఖవ్యాధులను తొలగించి ఎందరకో పూర్ణారోగ్యము ప్రసాదించింది—

ఎట్టి చర్మరోగాలవలన పీడితులైననూ మాతో సలహాచేయండి :—

బ్రాంచీలు : (1) గాంధినగరం, బెజవాడ,
(2) 22, బ్రాడ్వే, మద్రాసు.
తపాలపెట్టె నెం 137.

లక్ష్మి అండ్ కో, (రిజిస్టర్డు)
వాల్తేరు, ఆర్. యస్. పోస్టు.

రంగద్వారంలో వురికి దండ చరిచి నిలవబడ్డాడు.

ఆధ్వానికి అర్జునుడు వులిక్కిపడ్డాడు. ప్రేక్షకులు దద్దిరిల్లిపోయారు.

కర్ణుణ్ణి చూసి కృపాచార్యుడు గతుక్కుమన్నాడు.

భీష్ముడి హృదయం కలచిన ట్టుయిపోయింది.

ఈసంగతి విదురుడు చెప్పగా, ధృతరాష్ట్రుగు చాలా గంభీరంగా మందహాసం చేశాడు.

ప్రేక్షకజనసముద్రం వొక్కసారిటు గమ్మున పొంగిపోయింది.

మళ్ళీ అంతటా గాంభీర్యం నెలకొన్నది.]

---

### కర్ణుడు

(ఎదురొమ్ము విరుచుకుని సగర్వంగా) అర్జునా! ఇప్పు డిక్కడ విద్యార్థులలో ప్రతివాడూ నువ్వు చూపించిన చమత్కారా లన్నీ చూపించగలడు. వీరిలో కొందరు నీకంటే యెక్కువ విశేషాలే కనపరచనూ గలరూ. నువ్వొక్కడవే రంగంలో నుంచుని మహామహావాడిలాగ గారడీ చెయ్యడం విశేషంలోది కాదు. మనం యిద్దరమూ ద్వంద్వయుద్ధం చేద్దాం చేత నయితే కాసుకో.

### అర్జునుడు

(వెంకితనంగా) పలువా! ఇక్కడికి నిన్నెవరు పిలిచారూ? పరాత్మపరిమాణాలెరక్కుండా వాగడానికి నీ కెవరనుజ్ఞ యిచ్చారూ?

### సుయోధనుడు

(తృణీకారంగా మందహాసం చేసి) అర్జునా! బుకాయింపులు చాలించు. (దృఢస్వరంతో) కర్ణుణ్ణి నేను పంపాను.

### ద్రోణుడు

(విసుగ్గా) అర్జునా! అంత తొందర యేమీ? కర్ణుణ్ణి నేనున్నూ పంపాను.

### అర్జునుడు

(సిగ్గుపడి తలవంచుకుంటాడు)

### కర్ణుడు

(నిర్లక్ష్యంగా) అర్జునా! నాకు అలుగులతో జవాబు చెప్పు. నోటి తుంపర్లతో కాదు. ఈరంగభూమి అస్త్రవిద్యా విశారదుల కందరికీ సామాన్య మైనది. ఇక్కడ 'వీరికి ప్రవేశ మున్నది, వీరికి లేదు' అని విధినిషేధా లెవరికీ లేవు, తెలుసా? ఇక్కడ నీ విశిష్టత యేమీ లేదు. మిడిసిపడకు.

### ధర్మనందనుడు

(నిట్టూర్పు విడిచి తల వంచుకుంటాడు)

### భీమసేనుడు

(గుండెలమీద చెయ్యి వేసుకుని) మనకి జంకేమిటోయ్? అర్జునా! ఊఁ - కానియ్యి.

### కుంతీదేవి

(విదురుడితో జనాంతికం) ఆచార్యుల వారు వారి కిద్దరికీ వుజ్జీ వేశారేం పాపమూ?

### విదురుడు

(కుంతితో జనాంతికం) ధనుర్విద్యలో వారి కిద్దరికే పోలిక వున్నది. ఎటు చూసినా మరి మూడోవాడు కనపడడు.

### కుంతీదేవి

(మళ్లీ విదురుడితో జనాంతికం) ఇది సౌమ్యంగా తప్పిపోయే వుపాయం చూడండి.

### విదురుడు

(మళ్లీ కుంతితో జనాంతికం) ఏమీ లాభం లేదు. వారి కిద్దరికీ పోటీ జరగవలసిందే. మన మిప్పు డేమి మాట్లాడినా మర్యాద తక్కదు.

### సుయోధనుడు

కర్ణా! ఏమిటి తరువాయి?

### కర్ణుడు

నా ప్రత్యర్థనానికి మారుమాట లేదు.

### భీష్ముడు

అప్రస్తుతప్రసంగాలతో కాలహరణం కావడం యేమీ బాగాలేదు, ధనుర్గ్రాహా


## మీ పాపలకు

వేలకొలదిగ తలిదండ్రులు భావించునట్లు పిల్లలే గొప్ప విలువ గల సంపదగా మీరును భావించుచో వారు తమ ముద్దుబిడ్డలు బలారోగ్యములు కలిగియుండుటకు అవలంబించిన విధానమునే మీరును అవలంబించి వారివలె మీరును మీ పాపలకు

పండిత డి. గోపాలాచార్యులవారి

## బాలభాస్కర

వలని లాభమును చేకూర్తురు.

ఏస్థితియందున్నను బిడ్డల లీవర్ స్ప్లీన్ వ్యాధులను కుదుర్చుటకును, ఆటంకపరచుటకును బాలభాస్కర అమోఘమైన ఔషధము.

మాన్యుఫ్యాక్చరర్లు :

## ఆయుర్వేదాశ్రమము

మదరాసు.